ఏరియా దవాఖానలో సమస్యల తిష్ట

- అధ్వాన సేవలపై పటాన్‌చెరు కార్పొరేటర్ ఆగ్రహం
- సిజేరియన్ బాలింతను 16రోజులుగా డిశ్చార్జ్ చేయని వైద్యులు
- డెలివరీ మహిళలకు నాసిరకం వైద్యం
- పాచిపోయిన అన్నం పెడుతున్నారని మెట్టుకుమార్ మండిపాటు
- ఆరోగ్యశాఖ మంత్రి జిల్లాలో దుస్థితిపై ఆవేదన
- హరీశ్‌రావు మంత్రిగా ఉన్నప్పుడు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు

రోగులతో మాట్లాడుతున్న పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పాచిపోయిన అన్నం పెడుతున్నారని చూపిస్తున్న రోగులు, వారి కుటుంబ సభ్యులు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 25: పటాన్‌చెరు ఏరియా దవాఖానలో డాక్టర్ల పనితీరు, సిబ్బంది నిర్లక్ష్యంపై పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఏరియా దవాఖానలో పాచిపోయిన టిఫిన్లు పెడుతున్నారని పలువురు పేషెంట్లు ఫోన్‌లో కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన మెట్టు కుమార్‌యాదవ్ ఏరియా దవాఖానను పరిశీలించారు. నేరుగా ప్రసూతి వార్డులోకి వెళ్లి పేషెంట్లతో మాట్లాడారు. ఐనోల్ గ్రామానికి చెందిన బాలరాజు కుమార్తెకు 16రోజుల క్రితం సిజేరియన్ ఆపరేషన్ చేశారని, ఇప్పటివరకు కుట్లు మానడం లేదని కుటుంబసభ్యులు వివరించారు. కుట్ల వద్ద చీము కారుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. 16 రోజులుగా డిశ్చార్జ్ చేయడం లేదని వారు ఆరోపించారు. డెలివరీ అయిన పేషెంట్లకు సమయానికి భోజనం ఇవ్వడం లేదని బాలింతలు తెలిపారు. పాచిపోయిన ఆహారం ఇస్తున్నారని కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. పరిశుభ్రత కూడా సరిగ్గా ఉండటం లేదని వారు పేర్కొన్నారు. కార్పొరేటర్ దవాఖాన సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్ చేసి దవాఖానలో నిర్లక్ష్యం, వైద్యుల సేవాలోపంపై మాట్లాడారు. పరిస్థితిని చక్కదిద్దుతానని సూపరింటెండెంట్ కార్పొరేటర్‌కు హామీనిచ్చారు.

వైద్యశాఖ మంత్రి జిల్లాలోనే ఈ దుస్థితి

వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జిల్లాలోనే దవాఖాన పరిస్థితులు అధ్వానంగా మారాయి. పటాన్‌చెరు ఏరియా దవాఖానలో సేవాలోపం ఉంది. డాక్టర్ల నిర్లక్ష్యంతో బాలింతకు కుట్లు మానడం లేదు. 16 రోజులుగా బాలింతను డిశ్చార్జ్ చేయడం లేదు. పాడైన, పాచిపోయిన ఆహారం పేషెంట్లకు అందజేస్తున్నారు. సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. పేదలు, బడుగు వర్గాల వారికి ప్రైవేటు దవాఖానకు పోయే శక్తిలేక సర్కారు దవాఖానకు వస్తున్నారు. గతంలో వైద్యశాఖ మంత్రిగా హరీశ్‌రావు ఉన్నప్పుడు దవాఖానలు ప్రైవేటు కంటే బాగా సేవలందించేవి. ఇప్పుడు గర్భిణులను చేర్చుకుంటే రూ.5వేలు, సిజేరియన్ చేస్తే మరో రూ.5వేలు, ఇతర రూపాల్లో మరో ఐదు వేలు లంచంగా సిబ్బంది వసూలు చేస్తున్నారు. సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి త్వరలో లోపాలు చక్కదిద్దుతామని హామీనిచ్చారు. కొద్ది రోజుల తర్వాత దవఖానకు మళ్లీ వస్తా. పరిస్థితి ఇలానే ఉంటే ఉద్యమిస్తాం.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఈఎంటీ సిబ్బంది

ఆర్థిక సహాయం

పుల్కల్, ఫిబ్రవరి 25: ఇటీవల 108లో ఈఎంటీగా పనిచేసిన బోయిన నవీన్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న 108 సహోద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా స్పందించారు. మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్, వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలకు సంబంధించిన 108 ఉద్యోగులు రూ.50,100 బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. సహాయం అందజేసిన వారిలో పైలెట్లు జగన్, కృష్ణారెడ్డి, దేవగౌడ, సాయి, ఏఏపీ అనిల్, గోపాల్, ఈఎంటీ విజయ్ కుమార్ 102 పైలెట్‌బన్ని ఉన్నారు.

రైతు మృతిపై విచారణ

కల్హేర్, ఫిబ్రవరి 25: కల్హేర్ మండల పరిధిలోని మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన రైతు బుజ్రంపల్లి దుర్గయ్యకు రుణమాఫీ పైసలు రాకపోవడంతోపాటు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద బ్యాంకులో చెల్లించిన రుణం ఇవ్వకపోవడంతో బెంగపడి రైతు మృతి చెందారు. కల్హేర్ వ్యవసాయ అధికారి వెంకటేశం రైతు ఇంటికి వెళ్లి మృతిపై కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. బ్యాంకు మేనేజర్‌ను కలిసి రుణం మంజూరుపై, రుణమాఫీపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు, బ్యాంకు మేనేజర్ తెలిపిన వివరాల నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఆయన వెంట ఏఈవో సంతోష తదితరులు ఉన్నారు.

అభినందించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి

విద్యార్థినికి అభినందన

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 25: జపాన్‌కు వెళ్లనున్న విద్యార్థిని స్రవంతిని కలెక్టర్ వల్లూరు క్రాంతి అభినందించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కన్సాన్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని స్రవంతిని, గైడ్ టీచర్ సిద్దేశ్‌లను శాలువాతో సన్మానించి మెమోంటోతో కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా స్రవంతి చేస్తున్న డెస్క్ లిఫ్టర్ ప్రాజెక్ట్ విషయాలను అడిగి తెలుసుకున్నారు. జపాన్‌కు వెళ్లి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీఈవో వెంకటేశ్వర్లు, డీసీఈబీ కార్యదర్శి లింబాజీ, జిల్లా సైన్స్ అధికారి ఇద్దారెడ్డి ఉన్నారు.

సభలను జయప్రదం చేయాలి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 25: రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సాయిలు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ అన్నారు. మంగళవారం బీహెచ్‌ఈఎల్‌లో మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏండ్ల తరబడి ప్రభుత్వాలు మారుతునప్పటికీ భవన నిర్మాణ కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఏఐటీయూసీ పోరాడుతుందని తెలిన్నారు.

అనుమతి లేని నిర్మాణాన్ని కూల్చివేయిస్తున్న అధికారులు

అక్రమ నిర్మాణం కూల్చివేత

జిన్నారం ఫిబ్రవరి 25: అనుమతి లేని అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. బొల్లారం నుంచి గండిగూడెం వెళ్లే ప్రధాన రహదారి పక్కనే అనుమతులు లేని నిర్మాణాలను మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ తనిఖీ చేసి గుర్తించారు. అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ జేసీబీతో కూల్చివేతలు చేపట్టారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లా నీళ్లు తాగొద్దు

సదాశివపేట, ఫిబ్రవరి 25: పట్టణ ప్రజలు నల్లా ద్వారా వచ్చే నీటిని తాగొద్దని మున్సిపల్ కమిషనర్ ఉమా ప్రకటనలో తెలిపారు. జహీరాబాద్ సమీపంలో తాగు నీటి సరఫరా పైప్‌లైన్ లీకేజ్ అయిందని, లీకేజ్ అయిన పైప్‌లైన్ నుంచే పట్టణానికి తాగునీరు సరఫరా అవుతుందన్నారు. లీకేజీ కారణంగా పట్టణానికి సరఫరా అయ్యే తాగునీరు పచ్చగా వస్తుందని, ప్రజలు నల్లా నీటిని ఇతర అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. మరమ్మతు పనులు పూర్తయ్యే వరకు ప్రజలు సహకరించాలని కోరారు.

పార్టీ బలోపేతం కోసం చర్చిస్తున్న ముఖ్యనేతలు ఆదర్శ్‌రెడ్డి, మెట్టుకుమార్ తదితరులు

బీఆర్ఎస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేస్తాం

రామచంద్రాపురం,ఫిబ్రవరి 25: బీఆర్ఎస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేస్తామని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్, బీఆర్ఎస్ నేతలు సోమిరెడ్డి, బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్సీపురం డివిజన్‌లోని బీఆర్ఎన్ నేత ఆదర్శ్‌రెడ్డి నివాసంలో పటాన్‌చెరు నియోజకవర్గ ముఖ్యనేతలు సమావేశమయ్యారు. బీఆర్ఎస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేయడం, పార్టీ సభ్యత్వాలు, పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు, చేపట్టాల్సిన రాజకీయ కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను బలమైన శక్తిగా మారుస్తామన్నారు. నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నేతలందరూ కలిసికట్టుగా పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తామన్నారు. పార్టీ సిల్వర్‌జూబ్లీ వేడుకలను నియోజకవర్గంలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. పార్టీ సభ్యత్వ నమోదును కూడా పెద్దఎత్తున చేస్తామన్నారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు కమిటీల ఏర్పాటు, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కాంగ్రెస్ బోగస్ హామీలను నమ్మి మోసపోయామని ప్రజలు తెలుసుకున్నారని, కేసీఆరే మళ్లీ సీఎం కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలు కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని, ప్రతినిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, గోవర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 25: వచ్చే శాసనసభ ఎన్నికల్లో బీసీలదే రాజ్యాధికారం అవుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ జోస్యం చెప్పారు. మంగళవారం సంగారెడ్డిలోని నాలుగో తరగతి ఉద్యోగుల భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలనే గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఏ రాజకీయ పార్టీ బీసీలకు సీట్లు ఇవ్వలేదని విమర్శించారు. 90శాతం జనాభ ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీట్లు ఇవ్వకుండా అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం 9శాతం ఉన్న అగ్రకులాల వారికే పార్టీలు సీట్లు కేటాయించాయని మండిపడ్డారు. చట్ట సభల్లో బీసీ గొంతు లేకుండా చేసే కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రసన్నకుమార్, పూల రవీందర్, మల్క కొమురయ్యలను గెలిపించుకుంటామని చెప్పారు. బీసీ, రెడ్డిలకు మధ్య జరుగుతున్న పోరుగా అభివర్ణించారు. 100శాతం బీసీ అభ్యర్థులే గెలుస్తారని పేర్కొన్నారు. నేటి ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే రాబోయే 2028 శాసన సభ ఎన్నికలను శాసించనున్నాయని వివరించారు. ఇకపై బీసీ శకం మొదలవుతుందన్నారు. అంతకుముందు మేమెంతో – మాకంతా, ఓటు మాదే–సీటు మాదే అంటు నినాదాలు చేశారు. సమావేశంలో బీసీ సంఘం యువత రాష్ట్ర అధ్యక్షుడు కులకచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రం గౌడ్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు నాయికోటి రాజు, రమేశ్, జగదీశ్, రాహుల్, మల్లయ్య పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో మంగళవారం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్‌ను ప్రారంభించారు. జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్, డిప్యూటీ జోనల్ మేనేజర్ హరికృష్ణ మాట్లాడుతూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించడానికి కృషి చేస్తామన్నారు.

మహిళా అభివృద్ధే సమాజాభివృద్ధి

రాయికోడ్‌లో మాట్లాడుతున్న డీఆర్డీఏ ఏపీడీ జంగారెడ్డి

రాయికోడ్, ఫిబ్రవరి 25: సమాజంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే సమాజం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో మహిళా సంఘాలను ఏర్పాటు చేశామని డీఆర్డీఏ ఏపీడీ జంగారెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రమైన రాయికోడ్‌లో ఉన్న ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి ఐకేపీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా డీఆర్డీఏ ఏపీడీ జంగారెడ్డి మాట్లాడుతూ .. జిల్లాలో 15831 మహిళా సంఘాలను ఏర్పాటు చేశామన్నారు. వీరికి రూ.747కోట్లు రుణాలు ఇచ్చామని, రుణాలు తీసుకున్న సంఘాల సభ్యులు క్రమం తప్పకుండా రుణాలు చేలిస్తే వారికి వడ్డీ లేకుండా రాయితీ ఇస్తామని చెప్పారు. రాయికోడ్ మండలంలో ఈ సంవత్సరం అర్హులైన మహిళా సంఘాలకు రూ.45 కోట్లు రుణాలు ఇవ్వాలని ఉన్నప్పటికీ ఇప్పటి వరకు కేవలం రూ.35 కోట్ల రుణాలు ఇచ్చామని చెప్పారు. మిగిలిన రూ.10 కోట్లు మార్చి 5వ తేదీలోగా ఇవ్వాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామని డీఆర్డీఏ ఏపీడీ జంగారెడ్డి చెప్పారు. ఐకేపీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులను బ్యాంకుల వద్ద వారికి సంబంధించిన పత్రాలను పూర్తి స్థాయిలో అందజేసి వారికి రుణాలను వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో డీఆర్డీఏ డీపీఎం రవీందర్, ఐకేపీ ఏపీఎం నర్సింహులు, సిబ్బంది శివయ్య, నర్సింహులు, హనుమంతురెడ్డి,యాదయ్య, భార్గవి, గ్రామస్థాయి ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

హామీలు అమలుచేసే వరకు పోరాటం

కాంగ్రెస్ నాయకులను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, ఫిబ్రవరి 25: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించడంతో గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీస్తున్నారని, హామీలు అమలయ్యే వరకు పోరాటం చేస్తామని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్హేర్ మండల పరిధిలోని బీబీపేట్ పీఏసీఎస్ డైరెక్టర్ అంజాగౌడ్, నాయకుడు గొల్ల సాయిలు కాంగ్రెస్‌ను వీడి భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరచేతిలో వైకుంఠం చూపించడం కాదని ప్రజా సంక్షేమానికి పాటుపడడం కావాలన్నారు. సీఎం తోసహా మంత్రులు పూటకో మాట మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. హద్దుమీరి హామీలిచ్చి గద్దెనెక్కి ప్రజాపాలనను తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనను చూసి అన్నమో రామచంద్ర అని ప్రజలు తలలు పట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. హామీల అమలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పై బీఆర్ఎస్ చేస్తున్న పోరాటంలో పాల్గొంటామని పార్టీ చేరిన నాయకులు తెలిపారు.

అలరించిన సైన్స్‌ఫెయిర్

సైన్స్ ఫెయిర్‌లో ప్రయోగాలను వీక్షిస్తున్న యువజన నాయకుడు ప్రవీణ్‌రెడ్డి

జిన్నారం ఫిబ్రవరి 25: మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నబస్తీకి చెందిన బొల్లారం పబ్లిక్ స్కూల్లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ అండ్ ఫుడ్ ఫిస్ట్ అలరించింది. మున్సిపల్ యువజన నాయకుడు ప్రవీణ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు రూపొందించిన పలు సైన్స్ ప్రయోగాలను వీక్షించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...శాస్త్ర సాంకేతిక రంగాల వైపు విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే అభిరుచిని ఏర్పరచుకోవడం అభినందనీయమన్నారు. గురువులు, తల్లిదండ్రులు వారిలోని జిజ్ఞాసను కనిపెట్టి ప్రోత్సహించాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేసి నిర్వాహకులతో కలిసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యఅతిథులను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ప్రభుకుమార్, కరస్పాండెంట్లు హరికృష్ణ రెడ్డి, ఉదయ్‌భాస్కర్ రెడ్డి, సింహాచలం, శ్రీనివాసరావు, లోకనాథం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అశ్రునయనాలతో అంత్యక్రియలు

మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యేలు, నాయకులు

జహీరాబాద్, ఫిబ్రవరి 25: కాశీ విశ్వనాథుడి దర్శన నిమిత్తం వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇరిగేషన్ డీఈఈ వెంకట్‌రామిరెడ్డి, అతడి భార్య విలాసినీ, కారు డ్రైవర్ మల్లారెడ్డి అంత్యక్రియలు మంగళవారం రాత్రి అశ్రునయనాల మధ్య జరిగాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో పాల్గొని కాశీ విశ్వనాథుడి దర్శనం నిమిత్తం వెళ్తుండగా కారుకు ఎదురుగా బైక్ రావడంతో ఢీకొట్టి అదుపుతప్పి కారు టిప్పర్‌కు ఢీకొట్టిన సంఘటనలో వారు మృతి చెందిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు న్యూఢిల్లీలోని తెలంగాణ రెసిడెంట్ కమిషన్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని మిర్జాపూర్, వారణాసి జిల్లా కలెక్టర్లతో మాట్లాడి, మృతదేహాలను న్యాల్‌కల్ మండలంలోని గంగ్వార్, మల్లి గ్రామాలకు ప్రత్యేక అంబులెన్స్‌లో తీసుకువచ్చారు. మంగళవారం రాత్రి ఇరిగేషన్ డీఈఈ వెంకట్‌రామిరెడ్డి దంపతుల మృతదేహాలు గంగ్వార్‌కు చేరుకున్నాయి. కారు డ్రైవర్ మల్లారెడ్డి మృతదేహం మల్లి గ్రామానికి చేరుకుంది. మృతుల కుటుంబసభ్యుల రోదనలతో ప్రతిఒక్కరినీ కంటతడిపెట్టించాయి. డీఈఈ వెంకట్‌రామిరెడ్డి దంపతులు ఇద్దరు మృతి చెందడంతో అక్కడున్న వారంతా వారి పిల్లలను చూసి అయ్యేపాపం అనాథలైయ్యారని కన్నీరు పెట్టుకున్నారు. మల్లి గ్రామానికి చెందిన మల్లారెడ్డి మృతి చెందడంతో కుటుంబ పెద్దను కోల్పోయ్యామని భార్యాపిల్లలు కన్నీరు పెట్టుకుని రోదించారు. గంగ్వార్ గ్రామానికి చెందిన ఇరిగేషన్ డీఈఈ వెంకట్‌రామిరెడ్డి దంపతులు పార్థివదేహాలను జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, నా రాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీపాటిల్, నాయకులు తన్వీర్ హైమద్, ఉజ్వల్‌రెడ్డి, జహీరాబాద్, వికారాబాద్ ఇరిగేషన్ శాఖ ఈఈలు విజయ్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, డీఈఈ జనార్దన్‌రావు, ఏఈలు శ్రీహరి, ఆయూబ్‌ఖాన్, సిబ్బంది పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. డీఈఈ వెంకట్‌రామిరెడ్డి దంపతుల చివరిచూపు కోసం జహీరాబాద్, నా రాయణఖేడ్, సంగారెడ్డి, వికారాబాద్ తదితర ప్రాంతాలతోపాటు మండలంలోని చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

రంజాన్ మాసంలో సౌకర్యాలు కల్పించాలి

సదాశివపేట, ఫిబ్రవరి 25: రంజాన్ మాసంలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు గౌస్‌పా షా అన్నారు. మంగళవారం ఎంఐఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఉమాకు విన తిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లింలకు తాగునీరు, మసీదు, ఈద్గాల వద్ద పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీధి దీపాలు సరిగా పనిచేసే విధంగా చూడాలని, విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో రియాజుద్దీన్, ఖుద్దూస్ ఖురేషి, వసీం అక్రమ్, వాజిద్, జున్ను, మోయిస్, జాఫర్, సల్లావుద్దీన్, మోసిన్, ఇలియాజ్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ ఉమాకు వినతిపత్రం అందజేస్తున్న ఎంఐఎం నాయకులు

జహీరాబాద్‌లోని డీఎస్పీ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్సీ ఎన్నికలపై పోలీస్ అధికారులు, సిబ్బందితో సమీక్షిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

జహీరాబాద్, ఫిబ్రవరి 25:ఈనెల 27న జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బందోబస్తు సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బందితో ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా మండల కేంద్రాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం, రూరల్ సీఐ జక్కుల హనుమంతు, ఎస్ఐలు కాశీనాథ్, ప్రభాకర్‌రావు, రాజశేఖర్, రాజేందర్‌రెడ్డి, నరేశ్ ఉన్నారు.

జహీరాబాద్ నుంచి జాతరకు బస్సును ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్

ప్రత్యేక బస్సులను సద్వినియోగం చేసుకోవాలి

జహీరాబాద్, ఫిబ్రవరి 25: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జహీరాబాద్ ఆర్టీసీ డిపో నుంచి ఏడుపాయల వనదుర్గా మాత, ఝరాసంగం కేతకీ సంగమేశ్వర స్వామి జాతరోత్సవాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జహీరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. మంగళవారం స్థానిక డిపో నుంచి మెదక్ ఏడుపాయల వనదుర్గ మాత, ఝరాసంగం కేతకీ సంగమేశ్వర స్వామి జాతరోత్సవాలకు నడిపే ప్రత్యేక బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి 28వ తేదీ వరకు ఏడుపాయల వన దుర్గాదేవి ఆలయంతోపాటు ఝరాసంగంలోని కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయాలకు దర్శనం నిమిత్తం వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. డిపో నుంచి ప్రతి 15 నిమిషాలకు ఝరాసంగానికి, ప్రతి 30 నిమిషాలకు ఏడుపాయలకు బస్సులు నడుపుతున్నామన్నారు. శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనానికి వెళ్లేందుకు ప్రతిరోజూ 7.50 గంటలకు డీలక్స్ బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులందరూ సురక్షితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని సూచించారు. బస్సుల్లో మహాలక్ష్మి పథకం కింద మహిళాలకు జీరో టికెట్‌తో(ఫ్రీ)గా ప్రయాణించవచ్చని సూచించారు. ఆయా ఆలయాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్ట